సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 29 । జూన్ । 2024



మమ్మల్ని విడిచి వెళ్లొద్దు..
ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో విద్యార్థులు భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. - 8లో



పాతాళ భైరవి నాటక ప్రదర్శన
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడవీధిలో ప్రదర్శించిన పాతాళ భైరవి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. - 8లో

గరిష్టం / కనిష్టం
29° / 25°
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టెన్త్ సప్లిమెంటరీలో 77 శాతం ఉత్తీర్ణత

భువనగిరి : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 967 మంది విద్యార్థులు పరీక్ష రాగా 744 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 607 మందికి గాను 466, బాలికలు 360 మందికి 278 మంది ఉత్తీర్ణత సాధించారు. 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనుంజయనేయులు

భువనగిరి : తెలంగాణ క్రీడా ప్రాథశాలల్లో నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం శుక్రవారం భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనుంజనేయులు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ ప్రారంభించారు. ఎంపికైన విద్యార్థులను జూలై 10,11 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. పోటీలకు 120 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. అనంతరం పీడీగా పదోన్నతి పొందిన వ్యాయామపాధ్యాయులను సన్మానించారు.

కనుల పండువగా ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఆలయ తిరువీధిలో ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాళ్‌దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో సేవను ఊరేగించారు. సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టింపజేసి ఊంజలి సేవోత్సవం జరిపించారు. అలాగే ప్రధానాలయంలో సుప్రభాతం, అభిషేకం, అర్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

మత్స్యగిరిలో దుకాణాల వేలం



దుకాణాల నిర్వహణకు వేలం నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివిధ రకాల దుకాణాల నిర్వహణ, వ్రత, ఇతర పూజా సామగ్రి అమ్మకానికి శుక్రవారం దేవస్థానం ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వ్రత సామగ్రి రూ.8,77,889, బొమ్మలు, పాటల క్యాసెట్లు రూ.9,86,666, వాహన పూజల సామగ్రి రూ.5,50,000, టోల్‌గేట్ రూ.10,70,000, ఫొటో స్టూడియో రూ.91,000, కూల్‌డ్రింక్స్, హోటళ్లను రూ.2,81,000కు వేలందారులు దక్కించుకున్నారు. విడి పూలు, పూలదండల అమ్ముకునేందుకు రూ.2,36,666కు కైవసం చేసుకున్నారు. వేలం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ఆలయ ఈఓ మోహన్‌బాబు తెలిపారు.

గైనకాలజిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేయడానికి మూడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ గైనకాలజిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీసీహెచ్‌ఎస్ చిన్నానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 8వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు. సెలక్షన్ కమిటీ ద్వారా డాక్టర్ ఎంపిక ఉంటుందన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.లక్ష పారితోషికం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌కే సహకారం!



అవిశ్వాసం నెగ్గిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న డీసీసీబీ డైరెక్టర్లు

డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన 15 మంది డైరెక్టర్లు
- పదవి కోల్పోయిన బీఆర్‌ఎస్ నేత గొంగిడి మహేందర్ రెడ్డి
- జూలై 1వ తేదీన చైర్మన్ ఎన్నిక
- కాంగ్రెస్ వశం కానున్న డీసీసీబీ
- నూతన చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యే అవకాశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పీఠం కాంగ్రెస్ పార్టీ వశం కానుంది. ఇప్పటివరకు చైర్మన్‌గా వ్యవహరించిన బీఆర్‌ఎస్ నాయకుడు గొంగిడి మహేందర్‌రెడ్డిపై డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శుక్రవారం డీసీసీబీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 15 మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తడంతో మహేందర్‌రెడ్డి చైర్మన్ పదవిని కోల్పోయారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఉన్న దయాకర్‌రెడ్డిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించారు. మహేందర్‌రెడ్డితోపాటు ఆయన వెంట ఉన్న ముగ్గురు డైరెక్టర్లు సమావేశానికి హాజరుకాలేదు. జూలై 1వ తేదీన చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహిస్తామని జిల్లా సహకార అధికారి ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అనుచరుడు, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాసరెడ్డి కొత్త చైర్మన్‌గా ఎన్నిక కానున్నట్లు తెలుస్తోంది.

మ్యాజిక్ ఫిగర్ దాటి..
డీసీసీబీ అవిశ్వాస సమావేశానికి మ్యాజిక్ ఫిగర్ దాటి డైరెక్టర్లు హాజరు కావడంతో అవిశ్వాసం నెగ్గింది. కుంభం శ్రీనివాసరెడ్డి పక్కా వ్యూహంతో వ్యవహరించి తమవైపు ఉన్న ఒక్క డైరెక్టర్ కూడా వెనక్కి వెళ్లకుండా కాపాడుకోవడంలో సక్సెస్ అయ్యారు. ఈ నెల 10వ తేదీన అవిశ్వాసం నోటీసు ఇచ్చిన నాటి నుంచి 17 రోజుల పాటు వారు తనవెంటే ఉండేలా చూడగలిగారు. డీసీసీబీలోని మొత్తం 19 మంది డైరెక్టర్లలో 10 మంది కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా సహకార చట్టం నిబంధనల ప్రకారం అవిశ్వాసం నెగ్గాలంటే కనీసంగా 14 మంది (మూడింట రెండో వంతు) ఉండాల్సిందే. అందుకు అనుగుణంగానే కుంభం శ్రీనివాసరెడ్డి 14 మంది మద్దతు కూడగట్టగలిగారు.



విలేకరులతో మాట్లాడుతున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఇన్‌చార్జ్ చైర్మన్, డైరెక్టర్లు

మహేందర్‌రెడ్డికి నిరాశే..
డీసీసీబీలో మొత్తం డైరెక్టర్లు 19 మందిలో మొదట్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క డైరెక్టరే ఉన్నారు. మిగతా 18 మంది బీఆర్‌ఎస్‌కు చెందిన వారే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎనిమిది మంది బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైస్ చైర్మన్‌గా ఉన్న ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం 10కి చేరింది. బీఆర్‌ఎస్‌కు చెందిన మరో ఐదుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ వైపే మొగ్గుచూపారు. చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు ప్రవీణ్‌రెడ్డి, రంగాచారి, అప్పిరెడ్డి మాత్రమే బీఆర్‌ఎస్ వైపు ఉన్నారు. ఆయన వెంట కేవలం ముగ్గురు డైరెక్టర్లే ఉన్నా.. అవిశ్వాసం వీగిపోయేందుకు చివరి వరకు ప్రయత్నం చేశారు. అవిశ్వాసం వీగిపోవాలంటే 14 మంది సమావేశానికి హాజరు కాకుండా ఉండాలి. అందుకే కాంగ్రెస్ వైపునకు వెళ్లిన ఐదుగురిలో ఇద్దరిని వెనక్కి తీసుకొచ్చేందుకు మహేందర్‌రెడ్డి అన్ని ప్రయత్నాలు చేశారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి వెనక్కి రావాలంటూ వారితో చర్చలు జరిపినా ఫలితం దక్కలేదు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా..

- డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

డీసీసీబీని పార్టీలకతీతంగా.. రైతు సంక్షేమే ధ్యేయంగా ముందుకు తీసుకుపోతామని డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నల్లగొండ డీసీసీబీపై మరోసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతోందన్నారు. బ్యాంకును అభివృద్ధి చేస్తూ రైతులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గత పాలకులు డీసీసీబీకి రాజకీయ రంగు పులిమి ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు. తాము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగుల సలహాలు సూచనలతో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసమే అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గించుకున్నామని తెలిపారు. ఇందుకు సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, అంజయ్య, గుడిపాటి సైదులు, వీరస్వామి, కొండా సైదులు, కోడి సుష్మ, కరుణ, అనురాధ, అందేల లింగయ్య యాదవ్, రామచంద్రయ్య, జూలూరు శ్రీనివాస్, జయరాం నాయక్, బంటు శ్రీనుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హాస్టళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి



గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : సంక్షేమ వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ శాఖల అధికారులు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమావేశమై వాటి నిర్వహణ తీరుపై సమీక్షించారు. హాస్టల్ గదులతో పాటు పరిసరాలు, వంట గదులు, భోజనశాలలు, డార్మిటరీ హాళ్లు, రీడింగ్ రూంలు శుభ్రంగా ఉండాలన్నారు. అలాగే వాషింగ్ ఏరియాలు, టాయిలెట్లను ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఫినాయిల్‌తో శుభ్రం చేయిస్తుండాలని సూచించారు. వంటకు సంబంధించి నాణ్యమైన సరుకులు వినియోగించాలని, గడువు ముగిసిన వాటిని వినియోగించరాదని, అవసరమైతే ఫెడ్ ఇన్స్‌పెక్టర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వర్షాకాలం కాబట్టి వంట సామగ్రిని పొడి వాతావరణంలో ఉంచాలని, నిల్వ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. నీటి ట్యాంకులను ప్రతి రెండు వారాలకు ఒక సారి శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. విజిటర్స్ రికార్డులు నిర్వహించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వివరించారు. ఎక్కువ సార్లు వైద్య సేవలు పొందే విద్యార్థులను గమనించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రేరణ కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని జెడ్పీ సీఈఓకు సూచించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
వర్షాకాలంలో నీటి వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎప్పటికప్పుడు నీటి స్టోరేజీ ప్రాంతాలను పరిశీలించి శుభ్రమైన నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఏచిన్న సమస్య వచ్చినా తక్షణమే ఆస్పత్రికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. హాస్టళ్లను వైద్యులు సందర్శించాలని, అవసరాన్ని బట్టి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అన్ని సంక్షేమ శాఖలను సమన్వయం చేసుకొని స్పష్టమైన లక్ష్యాలు, సాధించే ప్రగతిపై నివేదికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పాపారావు, డీపీఓ సునంద, వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు

భూదాన్‌పోచంపల్లి : ధరణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భూదాన్‌పోచంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ధరణి దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షించారు. పరిష్కరించిన సమస్యల వివరాలపై ఆరా తీశారు. రోజూ ఎన్ని స్లాట్‌లు బుక్ అవుతున్నాయని తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ధరణి మాడ్యుల్‌లో ఉన్న అన్ని రకాల దరఖాస్తులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సైదిరెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.



ఫైళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అభివృద్ధికి నిధులు కేటాయించండి

- మంత్రి కోమటిరెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు భువనగిరి ఎమ్మెల్యే వినతి
- మూసీ ప్రక్షాళనపై మూసీ రివర్ ఫ్రంట్ ఎండీ ఆమ్రపాలితో చర్చ

సాక్షి, యాదాద్రి : భువనగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులతో సమావేశమై రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి.. భువనగిరి నియోజకవర్గంలో రోడ్లు, వంతెనల నిర్మాణానికి రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఘట్‌కేసర్ – ఉప్పల్ రోడ్డు విస్తరణ, బీటీ పనులు, మూసీపై జూలూరు – రుద్రవెల్లి, సంగెం –బొల్లేపల్లి వద్ద బ్రిడ్జిలు పూర్తి చేయాలని విన్నవించారు. అలాగే హైదరాబాద్ – వరంగల్ హైవేపై రామక్రిష్టాపురం, సింగన్నగూడెం, కొండమడుగు వద్ద, హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై భూదాన్‌పోచంపల్లి మార్గంలో కొత్తగూడెం వద్ద అండర్‌పాస్ నిర్మించాలని పేర్కొన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



హెచ్‌ఎండీఏ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఆమ్రపాలి

హెచ్‌ఎండీఏ కమిషనర్‌తో సమావేశం
హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కలిశారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల అభివృద్ధిపై చర్చించారు. భువనగిరి నియోజకవర్గంలోని బీబీనగర్, భువనగిరి మండలాల అభివృద్ధికి రూ.30 కోట్లు కేటాయించాలని కోరారు. భువనగిరి పట్టణంలో రోడ్ల సుందరీకరణ, పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి చెరువులను మినీట్యాంక్ బండ్లుగా మార్చాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని విన్నవించారు.

మూసీ ప్రక్షాళనపై..
మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలిని ఎమ్మెల్యే కలిసి మూసీ ప్రక్షాళనపై చర్చించారు. ప్రక్షాళనకు నిధులు విడుదల చేయాలని కోరారు.

నూతన చట్టాలను రద్దు చేయాలి



జిల్లా కోర్టు ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

- భువనగిరిలో న్యాయవాదుల నిరసన

భువనగిరి క్రైం : జూలై 1నుంచి అమలు చేయనున్న నూతన క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దు చేయాలని భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. కొత్త చట్టాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం భువనగిరి బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి జిల్లా కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టికల్ 21 ద్వారా రాజ్యాంగం ఇచ్చిన హక్కులను నూతన క్రిమినల్ మేజర్ చట్టాల ద్వారా కోల్పోతున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాలు చూపే ప్రమాదం ఉందని,, అమలు చేయతలపెట్టిన చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరారు. నూతన చట్టాలపై అన్ని బార్ అసోసియేషన్లు, న్యాయమూర్తులు, ప్రజలతో విస్తృతంగా చర్చ జరపాలన్నారు. భువనగిరి బార్ అసోసియేషన్ హాల్‌లో ఈ నెల 29న జిల్లా స్థాయి న్యాయవాదుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి అసోసియేషన్ సభ్యులు గజ్జెల రవీందర్ రెడ్డి, గోద వెంకటేష్‌గౌడ్, బొబ్బల కేశవరెడ్డి, బొల్లెపల్లికుమార్, ఐలు జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మల వెంకటేశ్, సురకంటి జంగారెడ్డి, జి.లింగం సురేష్, చింతల రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగని చదువులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత

- గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీలో జాప్యం
- గత సంవత్సరం పనిచేసిన వారిపై స్పష్టతనివ్వని ప్రభుత్వం
- నష్టపోతున్న విద్యార్థులు
- ఉమ్మడి జిల్లాలో 145 పోస్టులు ఖాళీ

భువనగిరి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత విద్యార్థుల చదువుకు ఆటంకం కలిగిస్తోంది. కళాశాలలు పునఃప్రారంభమై నెల రోజులు కావస్తున్నా గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించడం లేదు. ఈ ప్రక్రియ ప్రతి సంవత్సరం ఆలస్యంగా జరుగుతుండడంతో సకాలంలో సిలబస్ పూర్తి కావడంలేదు. ఫలితాలపై ప్రభావం చూపడానికి ఇది కూడా కారణమన్న విమర్శలున్నాయి.

2013 నుంచి గెస్ట్ ఫ్యాకల్టీలు..
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతను అధిగమించేందుకు 2013 నుంచి గెస్ట్ ఫ్యాకల్టీలను నియమిస్తున్నారు. వీరికి నెలకు రూ. 28,080 వేతనం చెల్లిస్తారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో యాదాద్రి భువనగిరిలోని 11 కళాశాలల్లో 40 మంది, నల్లగొండలోని 13 కళాశాలల్లో 60 మంది, సూర్యాపేట జిల్లాలోని 7 కళాశాలల్లో 45 మంది చొప్పున గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించాల్సి ఉంది.



గత ఏడాది 145 మంది నియామకం
గత విద్యా సంవత్సరం పనిచేసిన గెస్ట్ ఫ్యాకల్టీలను ఈసారి కూడా కొనసాగిస్తారా లేదా.. అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గత విద్యా సంవత్సరం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 145 మంది అతిథి అధ్యాపకులను నియమించారు. వీరిని కొనసాగిస్తారా, కొత్త నియామకాలు చేపడుతారా.. ఇంటర్ బోర్డు నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

పడిపోతున్న ఫలితాలు
జిల్లాలో ఇంటర్ ఫలితాలు ఏటేటా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. కానీ, కళాశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సెకండియర్ తరగతులు ముమ్మరంగా నడుస్తుండగా, ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఫ్యాకల్టీలను నియమించకపోవడంతో సెకండియర్ విద్యార్థులు చదువులో వెనుకపడే అవకాశం లేకపోలేదు. తమను కొనసాగించే విషయమై స్పష్టత ఇవ్వాలని గత ఏడాది పనిచేసిన గెస్ట్ ఫ్యాకల్టీలు ఇటీవల ఇంటర్‌బోర్డు అధికారులను కూడా కలిసి విన్నవించారు. అయినా ఇప్పటివరకు స్పష్టత రాలేదు.

విధుల్లోకి తీసుకోవాలి



గత సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పనిచేసిన అధ్యాపకులను ఈ విద్యా సంవత్సరం కూడా తీసుకోవాలి. ఇప్పటికే కళాశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే ఇంటర్ బోర్డు అధికారులను సైతం కలిసి కోరాం. త్వరగా నిర్ణయం తీసుకోవాలి.

– ఎండీ మజీద్, అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు

విద్యార్థులు నష్టపోతున్నారు
గత విద్యా సంవత్సరానికి సంబంధించి అతిథి అధ్యాపకులకు నాలుగు నెలల వేతనాలు చెల్లించలేదు. ఏప్రిల్, మే నెలతో పాటు ఇప్పటివరకు విధుల్లో చేరకపోవడంతో వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అంతేకాకుండా ఫ్యాకల్టీలను తీసుకోకపోవడం వల్ల విద్యార్థులు కూడా నష్టపోతున్నారు.

– మహేష్‌కుమార్, గెస్ట్ ఫ్యాకల్టీల రాష్ట్ర అసోసియేట్ సహ అధ్యక్షుడు

సూపర్ మార్కెట్లలో తనిఖీలు

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్: భూదాన్ పోచంపల్లిలోని రిలయన్స్ స్మార్ట్, చౌటుప్పల్ పట్టణంలోని పలు సూపర్‌మార్కెట్లలో శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో నిత్యావసర సరుకుల ప్యాకెట్ల తయారీ, గడువు తేదీలను పరిశీలించారు. మిర్యాలు నీటిలో వేసి వాటి నాణ్యతను పరిశీలించారు. అలాగే కోడిగుడ్లు, బిస్కట్‌లను చూశారు. కొనుగోలుదారుల వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. వినియోగదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, నాణ్యమైన వస్తువులనే విక్రయించాలని, కల్తీవి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేషన్ అధికారి సుమన్ కల్యాణ్, నల్లగొండ, యాదాద్రి జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారిణి స్వాతి తనిఖీలు నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కేంద్ర ప్రభుత్వ అధికారి

- పోషణ్ ట్రాకర్ యాప్ పనితీరు పరిశీలన

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని చొల్లేరు గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ గామినీ సింగ్లా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని మహిళలు, చిన్నారులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. మాతా, శిశు సంక్షేమంకోసం అందజేస్తున్న సేవలపై కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల పెరుగుదల, మానసిక, శారీరక అభివృద్ధి, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. సరైన సమయంలో పౌష్టికాహారం అందజేయడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. గర్భిణులు, బాలింతలు కూడా ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా పోషణ్ ట్రాకర్ యాప్‌ను పనితీరును పరిశీలించారు. తెలంగాణలో చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ల సందర్శనలో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు గామిని సింగ్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎస్.మోతీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ అసిస్టెంట్ సెక్రటరీ

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శ్రీనివాసచారి

గుర్రంపోడు : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం గుర్రంపోడు మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండలం నేర్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డోజు శ్రీనివాసచారి (40) గుర్రంపోడు మండల కేంద్రంలో స్థిరపడ్డాడు. ఈ నెల 24న తన కుమారుడిని మోడల్ స్కూల్ నుంచి ఇంటికి తీసుకుని వస్తుండగా.. ఎదురుగా వస్తున్న బైక్ శ్రీనివాసచారిని బలంగా ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. శ్రీనివాసచారి మామ నారోజు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కేశ్యతండా, మేగ్యతండాలలో శుక్రవారం దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 600 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, వై.వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, నాగరాజు, అనిల్, మహేశ్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన మార్క బాలనరసింహ వృత్తిరీత్యా గీతకార్మికుడు. బాలనరసింహ రోజు మాదిరిగా కల్లు తీయడానికి శుక్రవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే బాలనరసింహను చికిత్స నిమిత్తం భువనగిరి ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉన్నతంగా మహిళా డిగ్రీ కళాశాల

- 1972లో తొమ్మిది మందితో నల్లగొండ పట్టణంలో ప్రారంభం
- నేడు మూడు వేల మంది విద్యార్థినులు
- స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల
- దోస్త్ ద్వారా అడ్మిషన్లు



నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కంప్యూటర్ నేర్చుకుంటున్న విద్యార్థినులు

నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల సరస్వతీ నిలయంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఏకైక మహిళా డిగ్రీ కాలేజీ కావడంతోపాటు అత్యుత్తమ బోధన అందిస్తుండడంతో ఈ కళాశాలలో చేరేందుకు ఉమ్మడి జిల్లాల విద్యార్థినులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కళాశాలలో 8 కోర్సుల ద్వారా విద్యార్థినులకు విద్యను అందిస్తున్నారు. సబ్జెక్టుల్లో చాయిస్ బేస్డ్ పద్ధతిలతో బోధన జరుగుతోంది. స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా డిగ్రీ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలతో రెండు షిఫ్టులుగా విద్యా బోధన జరుగుతోంది. దోస్త్ ద్వారా 2015–16 నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

గత ఏడాది కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్

నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు గత ఏడాది న్యాక్ 'ఏ'గ్రేడ్ ప్రకటించింది. 1972లో కేవలం 9 మంది విద్యార్థినులతో ప్రారంభమై నేడు మూడు వేల మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాలలో అధునాతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానం, సెమినార్ హాల్, ప్రయోగ శాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, తాగునీటి వసతి, గ్రంథాలయం ఉన్నాయి. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, మ్యాగజైన్లు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి.

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులు

ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు గత ఏడాది పీజీ ఎంట్రెన్స్ టెస్టులో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించేందుకు విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు ఎంతోమంది ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పోటీ పరీక్షలో కళాశాలకు చెందిన బొజ్జ భవానికి ఇటీవల ఉద్యోగం రాగా.. జిల్లా కోర్టులో స్టెనోగ్రాఫర్‌గా మరో విద్యార్థిని చందన ఎంపికైంది. అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలు, జాతీయ స్థాయి క్రీడల్లో ఈ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చూపుతున్నారు. కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.సరయు త్రైక్వాండో పోటీలో జాతీయ స్థాయిలో రిఫరీగా ఎంపికైంది. గత ఏడాది నలుగురు విద్యార్థినులు అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

మహిళా కళాశాలలో అందించే కోర్సులివే..

కోర్సు	మీడియం
బీఏ	ఉర్దూ
బీఏ	ఇంగ్లిష్
బీఏ	తెలుగు
బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ లైఫ్‌సైన్స్	ఇంగ్లిష్
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	ఇంగ్లిష్
కంప్యూటర్ సైన్స్ హానర్స్	ఇంగ్లిష్

ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో..

మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ పట్టణం నడిబొడ్డున ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండాపోయాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు తమ పిల్లలకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో ఈ కళాశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. కోదాడ, సూర్యాపేట, భువనగిరి నుంచి విద్యార్థినులు వచ్చి ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కొందరు విద్యార్థినులు హాస్టల్‌లో, బంధువుల ఇళ్లల్లో, బస్‌ల్లో వచ్చి కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ కళాశాలలో మహిళలకు డిగ్రీలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బ్రాంచ్ కూడా ఉంది.

విద్యార్థినుల భవిష్యత్‌కు జాబ్ మేళా



విద్యార్థినుల భవిష్యత్ కోసం డిగ్రీ ఫైనలియర్‌లో జాబ్‌మేళా నిర్వహించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నాం. విద్యార్థినుల్లో పోటీతత్వం పెంచేందుకు క్రీడల్లో ప్రోత్సహించడంతోపాటు ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేశాం. జాతీయ సెమినార్లు నిర్వహించి విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నాం.

– ఘనశ్యాం, ప్రిన్సిపాల్

పోటీ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం



విద్యార్థినులు అన్ని పోటీ పరీక్షల్లో రాణించేవిధంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉంచాం. ఇంటర్నెట్ సౌకర్యంతో గ్రంథాలయం విద్యార్థినులకు అందుబాటులో ఉంది. విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం.

– ఎస్. రాజారామ్, గ్రంథపాలకుడు

మమ్మల్ని విడిచి వెళ్లొద్దు మాస్టారూ..

- సోమాజీపల్లి, పోలుమల్ల గ్రామాల ఉపాధ్యాయుల బదిలీ
- వెళ్లొద్దని కాళ్లు పట్టుకుని బోరున ఏడ్చిన విద్యార్థులు


పోలుమల్లలో ఉపాధ్యాయుడి వద్ద కూర్చుని ఏడుస్తున్న విద్యార్థులు

మద్దిరాల : విద్యార్థి జీవితంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రతి ఒక విద్యార్థి ఎదుగుదలలో గురువుల పాత్ర ఎనలేనిది. విద్యార్థులతో అలాంటి బంధం పెనవేసుకున్న గురువు దూరమైతే ఆ బాధ వర్ణణాతీతం. మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాలుగా తెలుగు పండిట్‌గా మెంతబోయిన సైదులు పనిచేస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. విద్యార్థులందరితో ఎంతో ప్రేమగా మెలిగేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన పోలుమల్ల పాఠశాల నుంచి నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ ప్రభుత్వ పాఠశాలకు బదిలీ అయ్యారు. శుక్రవారం పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని విద్యార్థులు మీరు మమ్మల్ని విడిచి వెళ్లొద్దు సార్ అంటూ ఏడ్చుకుంటూ ఉపాధ్యాయుడి కాళ్లు పట్టుకుని వేడుకున్నారు. దీంతో ఆ విద్యార్థులు చూపించిన ప్రేమకు ఉపాధ్యాయుడు సైతం కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయుడికి మధ్య ఉన్న అనుబంధం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులను కట్టిపడేసింది. చూసేవారిని కంటతడిపెట్టేలా చేసింది. గ్రామస్తులతో 12 ఏళ్ల అనుబంధాన్ని పెంచుకోవడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం బరువెక్కిన హృదయంతో ప్రదీప్ కన్నాకు వీడ్కోలు పలికారు.

విద్యార్థుల ప్రేమ మరువలేనిది



విద్యార్థులు నాపై చూపిన ప్రేమ ఎప్పటికీ మరిచిపోలేను. వాళ్లు ఏడుస్తుంటే నాకు కూడా కన్నీళ్లు ఆగలేదు. ఉద్యోగంలో బదిలీలు సహజం. నేను ఎక్కడ ఉన్నా విద్యార్థుల మంచిని కోరుకుంటా. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తా.

– మెంతబోయిన సైదులు, ఉపాధ్యాయుడు

సోమాజీపల్లి గ్రామంలో..

బొమ్మలరామారం : మండలంలోని సోమాజీపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రదీప్ కన్నా పదోన్నతిపై రాజపేట మండలం బేగంపేట జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. గురువారం ఆయన పాఠశాల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో విద్యార్థులు ప్రదీప్ కన్నా చుట్టూ చేరి మన స్కూల్ నుంచి మీరు పోవద్దంటూ కంటతడి పెడుతు కాళ్లు పట్టుకుని ప్రాధేయపడ్డారు. సార్ మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లొద్దంటూ బోరున విలపించారు. వారి రోదనలతో ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నా సైతం భావోద్వేగానికి గురై కంటతడి పెట్టాడు. 12 సంవత్సరాల క్రితం మారుమూల ప్రాంతమైన సోమాజీపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో రోడ్డు సౌకర్యం సైతం సరిగా లేని రోజుల్లో ప్రదీప్ కన్నా విధుల్లో చేరారు. పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచుతూ దాతల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలను సమర్థంగా నిర్వహించారు. పాఠశాలతోపాటు


ఉపాధ్యాయుడు ప్రదీప్ కన్నాను పట్టుకుని రోదిస్తున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రి మృతి


యూసుఫ్ (ఫైల్)

నేరేడుచర్ల : రోడ్డు ప్రమాదంలో ఓ సెంట్రింగ్ మేస్త్రి మృతి చెందిన సంఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి వద్ద చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండల కేంద్రంలోని రాజీవ్ నగర్‌కు చెందిన సెంట్రింగ్ మేస్త్రి ఎస్‌కె.యూసుఫ్ (55) సెంట్రింగ్ పనుల నిమిత్తం కోదాడ– జడ్చర్ల ప్రధాన జాతీయ రహదారిపై మిర్యాలగూడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈక్రమంలో చిల్లేపల్లి చెరువు సమీపంలోకి రాగానే.. కడప నుంచి జగ్గయ్యపేట వైపు కెమికల్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం డ్రైవర్ బాషబోయిన సిద్దరామయ్య ఎదురుగా వస్తున్న యూసుఫ్ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టాడు. దీంతో యూసుఫ్ బైక్‌పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఏడాది క్రితం మృతి చెందగా.. మృతుడికి వివాహం అయినా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

ఇద్దరు యువకుల రిమాండ్

చిట్యాల: మంచినీరు కావాలని ఓ ఇంటికి వెళ్లి, ఆ ఇంట్లోని వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఇద్దరు యువకులను శుక్రవారం పోలీసులు రిమాండ్ చేశారు. చిట్యాల ఎస్ఐ డి.సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన చిట్యాల మండలం పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ ఇంటి వద్దకు నలుగురు యువకులు రెండు బైక్‌లపై వచ్చారు. తాగేందుకు మంచినీరు కావాలని ఆమెను అడిగారు. అనంతరం ఇద్దరు యువకులు ఆమె వెంట ఇంటిలోపలికి వెళ్లి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని బైక్‌లపై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. పుస్తెల తాడు దొంగిలించిన చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సంపంగి కల్యాణ్, మరో బాలుడిని ఎస్ఐ సైదాబాబు ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో పట్టుకుని రిమాండ్ చేశారు. కాగా అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును రికవరీ చేసి బాధితురాలికి అందజేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు యువకులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గరిడేపల్లి : మహిళ మెడలోనుంచి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కెళ్లిన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అబ్బిరెడ్డిగూడెం ఆవాసం సుభాష్‌నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గాదే నరసమ్మ తన పెసర చేను వద్దకు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కొంత దూరంలో బైక్ ఆపాడు. మహిళ వద్దకు వెళ్లి క్రషర్ మిల్లుకు ఎలా వెళ్లాలని అడిగి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాడును లాక్కుని బైక్‌పై అక్కడి నుంచి పారిపోయాడు. గాదే నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంప్ హౌస్‌లో చెట్లు నరికివేత


ట్రాక్టర్‌లోకి ఎక్కించేందుకు సిద్ధంగా ఉంచిన చెట్ల మొద్దులు

చింతపల్లి : మండల పరిధిలోని నసర్లపల్లిలో గల హైదరాబాద్ మెట్రో వాటర్ ప్లాంట్‌లో ఐదు రోజుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికివేయడం చర్చనీయాంశంగా మారింది. వాటర్ ప్లాంట్ వెనుక భాగంలో గుట్టుచప్పుడు కాకుండా గోడపైకి స్టాండ్ల సహాయంతో ఎక్కి పంప్‌హౌస్‌లో ఉన్న భారీ వృక్షాలను కూలీల సహాయంతో నరికివేసి ట్రాక్టర్లు, లారీల ద్వారా భారీస్థాయిలో రవాణా చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే లక్షల రూపాయల విలువైన చెట్లను నరికి అమ్మకానికి తరలించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంప్‌హౌస్‌లో చెట్ల నరికివేతకు ఫారెస్ట్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అధికారుల అండదండలతో బయటి వ్యక్తులు ఈ అక్రమ కలప రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అబార్షన్ ఘటనలో ఏడుగురిపై కేసు

సూర్యాపేట టౌన్ : పుట్టబోయేది ఆడపిల్ల అని స్కానింగ్‌లో తెలుసుకుని భార్యకు అబార్షన్ చేయించి ఆమె మృతికి కారణమైన కేసులో భర్తతో పాటు మరో ఆరుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వేంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన హరిసింగ్‌తో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని రాముతండాకు చెందిన భట్టు కృష్ణ కుమార్తె సుహాసినికి 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కుమారుడి కోసం మూడో కాన్పు ఉంచుకున్నారు. అయితే ఏడు నెలల గర్భవతి అయిన సుహాసినికి స్కానింగ్ చేయించగా ఆడపిల్ల అని తేలడంతో ఆమెకు ఎలాగైనా అబార్షన్ చేయించాలని హరిసింగ్ నిర్ణయించుకున్నాడు. హుజూర్‌నగర్‌లోని కమల ఆస్పత్రిలో సుహాసినికి అబార్షన్ చేయించాడు. అయితే ఆపరేషన్ వికటించి ఆమె పరిస్థితి విషమించడంతో కోదాడ, ఖమ్మం, సూర్యాపేటలోని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లగా ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు చెప్పారు. తమ కుమార్తె మృతికి కారణమైన హరిసింగ్‌తోపాటు కుటుంబ సభ్యులు, ఆస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో సుహాసిని తండ్రి భట్టు కృష్ణ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్టు సీఐ రాజశేఖర్ తెలిపారు. ఈ కేసులో భర్త హరిసింగ్‌తోపాటు మృతురాలి అత్త, ఇద్దరు ఆడపడుచులు, కమల ఆస్పత్రి యాజమాన్యమైన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఈ కేసును చివ్వేంల స్టేషన్‌కు బదిలీ చేసినట్టు సీఐ తెలిపారు.

రాచకాల్వ గేటు అపహరణ

భువనగిరి క్రైం : చిన్నేరు వాగుపై బొల్లెపల్లి పెద్దచెరువు కాలువ కత్వకు గల గేటును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు సిరివేణికుంట మాజీ సర్పంచ్ పడాల అనిత వెంకటేశ్ తెలిపారు. అధికారులు విచారణ జరిపి దుండగులను పట్టుకోవాలని, గేటుకు మరమ్మతులు చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కనుకుంట్ల బాబురావు, బొర్ర ప్రభాకర్, రైతులు బొర్ర గోపాల్, సిద్ధగోని కృష్ణమూర్తి, యంజాల యాదగిరి, బొర్ర నరేష్ ఉన్నారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

నూతనకల్ : కోతులు దాడి చేసి మహిళను గాయపర్చిన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పోతుగంటి నాగమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి కోతులు ఇంట్లో ఉన్నాయి. మహిళ రావడాన్ని గమనించిన కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి రెండు చేతులను తీవ్రంగా గాయపరిచాయి. కోతులు దాడిచేస్తున్న సమయంలో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి అవి వెళ్లిపోయాయి. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.


రఘునాథపాలెంలో..

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో కోతుల గుంపు దాడి చేయడంతో శుక్రవారం నాయుడు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వెంకటేశ్వర్లును స్థానికులు హుజూర్‌నగర్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

మిర్యాలగూడ టౌన్ : పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామ శివారులో గల డంపింగ్ యార్డు వద్ద కొంతమంది పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అయితే పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న నలుగురు వ్యక్తులు పరారీ కాగా మరో ఇద్దరు పోలీసులకు చిక్కారు. మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేశామని, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్లు, రూ.43,940 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రిలో పాతాళ భైరవి నాటక ప్రదర్శన



పాతాళ భైరవి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఉత్తర మాడవీధిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవినాయక నాట్య మండలి (సురభి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శన శుక్రవారం రెండోరోజుకు చేరింది. సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పాతాళ భైరవి నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. పాతాళ భైరవి, తోట రాముడు, ఇందుమతి, మాంత్రికుడు, యక్షిణి కన్య వంటి పాత్రల్లో కళాకారుల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. కేంద్రీయ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతల దర్శకత్వంలో అత్యంత మనోరంజకంగా నాటకాన్ని ప్రదర్శించారు. పాతాళ భైరవిగా ఆర్ శ్రీదేవి, తోట రాముడిగా శుభకర్, ఇందుమతిగా శాంతి, మాంత్రికుడిగా ఎస్.ఏ.శివశంకర్, యక్షిణిగా లక్ష్మీ, రాజాగా దినకర్, సీను మహరాజ్‌గా వి.ఉపేందర్, చంపగా వినమ్రవైనవి, నలినిగా మంజుమోహిని, పూజారిగా ఎస్.సుబ్బారావులు నటించారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : విద్యుదాఘాతంతో మృతిచెందిన నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన మామ అల్లుళ్లు మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలకు శుక్రవారం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మాద వీరేందర్, భూపతి జానయ్య భార్యలు పావని, ఉపేంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. మృతదేహాలకు నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం వారి స్వగ్రామం ఓగోడుకు తరలించారు. మృతదేహాలను చూసేందుకు ఓగోడు, పక్కనే ఉన్న నడిగూడెం, వల్లభాపురం, పాలెం గ్రామ ప్రజలు కూడా వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. మాద వీరేందర్, భూపతి జానయ్య మృతదేహాలను కాంగ్రెస్ నేత దైద రవీందర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఫార్మా కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదు

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఫార్మా కంపెనీలకు మునుగోడు నియోజకవర్గంలో అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో కాలుష్య నియంత్రణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే రెడ్ కేటగిరి కంపెనీలకు ఎన్ని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. అదేవిధంగా కంపెనీల సీఎస్ఆర్ నిధులు ఎక్కడెక్కడ ఖర్చు చేశారని అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న మునుగోడు మండలంలోని కిష్టాపురం, గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఫార్మా కంపెనీల పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం కాపాడడమే తన ప్రధాన కర్తవ్యమని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గంలో కాలుష్యం వెదజల్లే కంపెనీల వివరాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి మరో వారం రోజుల్లో నిర్వహించే సమీక్ష సమావేశానికి ప్రతి ఉద్యోగి హాజరుకావాలని సూచించారు.

వీఐపీ టికెట్లు రీసైక్లింగ్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వీఐపీ రూ.150 టికెట్లను భక్తుల నుంచి సేకరించి, అదే టికెట్లను వేరే భక్తులకు విక్రయిస్తున్న వ్యక్తిపై యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. వివరాలు.. యాదాద్రీశుడి దర్శనానికి హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి మినీ బస్సులో వచ్చారు. సుధాకర్‌తోపాటు కుటుంబ సభ్యులు రూ.150 టికెట్ తీసుకొని గోల్డెన్ క్యూలైన్‌లో వెళ్తున్న సమయంలో కొబ్బరికాయలు కొట్టే ప్రదేశంలో అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే టంటం వెంకటేష్ భక్తుల వద్ద టికెట్లను తీసుకున్నాడు. ఈ విషయాన్ని మహా ద్వారం వద్ద విధుల్లో ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందికి భక్తుడు సుధాకర్ తెలియజేశాడు. వెంటనే ఎస్పీఎఫ్ సిబ్బంది గోల్డెన్ క్యూలైన్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా టంటం వెంకటేష్ వద్ద టికెట్లు ఉన్నట్లు గుర్తించారు. వెంకటేష్ భక్తుల వద్ద రూ.150 టికెట్లను తీసుకొని వేరే భక్తులకు విక్రయిస్తున్నట్లు ఎస్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. వెంకటేష్.. భక్తుల నుంచి అక్రమంగా టిక్కెట్లు తీసుకుని, దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగించి, అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంకటేష్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈఓ భాస్కర్‌రావు సూచనతో అధికారులు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అర్ధభాగం కొబ్బరిచిప్పల సేకరణ కాంట్రాక్టర్ బిట్టు కిశోర్ టెండర్‌ను రద్దు చేయాలని నోటీసులు సైతం జారీ చేసినట్లు ఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సల్ల పాండు

భువనగిరి రూరల్ : మండలంలోని అనంతారం గ్రామ మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున సల్ల పాండు సౌజన్యంతో శుక్రవారం నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పక్కీరు కొండల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా పాఠశాలలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజలింగం, విటల్ నాగరాజు, మేకల భారతి, పద్మ, వెంకటేశ్, జహంగీర్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్, ప్రధానోపాధ్యాయుడు వినోద్, ఉపాధ్యాయురాలు సవిత, శోభ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అడ్డగూడూరు: మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ శేషగిరి రావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యాక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, జెడ్పీటీసీ శ్రీరాముల జ్యోతి, సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి,జోసఫ్, ఎంపీడీఓ శంకరయ్య, జోజి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వాలని పాదయాత్ర

యాదగిరిగుట్ట: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు యాదాద్రి ఆలయ వైకుంఠ ద్వారం నుంచి కొమురవెల్లి మల్లన్న ఆలయానికి శుక్రవారం పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కోటాలో బీర్ల అయియ్యకు కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. పాదయాత్ర చేసిన వారిలో గుండ్ల నర్సింహగౌడ్, కొకుంట్ల బాల్‌రెడ్డి, బండి అశోక్, ములుగు నర్సింహ, పసుల శ్రీనివాస్, సుడుగు వెంకట్ రెడ్డి, ఆవుల జహంగీర్, వెంకట్ ఉన్నారు. పాదయాత్రను గుండ్లపల్లి భరత్‌గౌడ్, బందారపు బిక్షపతి, ఎరుకల హేమేందర్, పెలిమెల్లి శ్రీధర్ తదితరులున్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న సూరెపల్లి గ్రామస్తులు

భువనగిరి రూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం నుంచి సూరెపల్లి గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని విద్యార్థులు, ప్రయాణికులు శుక్రవారం బస్ కంట్రోలర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు ఆటోల్లో, ఇతర వాహనాల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయిని, బస్సును పునరుద్ధరించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట్ నర్సింహరెడ్డి, మురళి, ప్రభాకర్, నవీన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

3న సింగిల్‌విండో సర్వసభ్య సమావేశం

రామన్నపేట : రామన్నపేట సింగిల్‌విండో అత్యవసర సర్వసభ్య సమావేశం జూలై 3న చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు సీఈఓ జంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, రైతుబంధు పథకం అమలు గురించి రైతుల సూచనలు, సలహాలు తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నేడు కరెంటు సరఫరాలో అంతరాయం

మోత్కూరు : మోత్కూరులో ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా కరెంటు స్తంభాలు షిఫ్టింగ్ లైన్ మార్చడం పనులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్ నుంచి కొత్త బస్టాండ్ వరకు కరెంటు సరఫరా నిలిపి వేయబడుతుందని ట్రాన్స్‌కో ఏఈ హుస్సేన్ తెలిపారు. కరెంటు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

● అధ్వాన రహదారులతో అవస్థలు



గుంతలమయంగా గుండాల-గంగాపురం రోడ్డు



బ్రిడ్జి పక్కన గుంతలమయమైన మరిపడిగ రోడ్డు

గుండాల : గుండాల మండలంలో పలు గ్రామాల రహదారులు గుంతలమయంగా మారాయి. రోడ్డు ధ్వంసమై గుంతలు పడటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట ప్రయాణించే వాహనదారులు గుంతలలో నిలిచిన నీరును గమనించకుండా అందులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మండలంలోని పాచిల్ల నుంచి బండకొత్తపల్లి మీదుగా దేవరుప్పుల వరకు, గుండాల గ్రామం నుంచి గంగాపురం మీదుగా సూర్యాపేట-జనగామ రోడ్డు వరకు, సీతారాంపురం క్రాస్ రోడ్డు నుంచి మరిపడిగ మీదుగా సూర్యాపేట, జనగామ రోడ్డు వరకు, రామారం నుంచి మాసాన్‌పల్లి, సీతారాంపురం, వెల్మజాల గ్రామాల వరకు, గుండాల నుంచి నూనెగూడెం వరకు రోడ్లు అధ్వానంగా మారాయి.

మదర్ డైయిరీ చైర్మన్‌గా శ్రీకర్‌రెడ్డి ఎన్నిక



చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

మోటకొండూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో మదర్ డెయిరీ చైర్మన్‌గా 11వ సారి లింగాల శ్రీకర్ రెడ్డి ఎన్నికయ్యారు. డైరెక్టర్‌గా నమిలె రమేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాడి రైతుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని, రైతులకు రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని తెలిపారు. అనంతరం రైతులు చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు సందీప్, మల్లేష్, పాండు, ఉపేందర్, అశోక్ పాల్గొన్నారు.

కాటేపల్లిలో

మండలంలోని కాటేపల్లి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా శివరాత్రి రాములు ఎన్నికయ్యారు. డైరెక్టర్‌లుగా సుధగాని రమేష్, మంత్రి రాజమల్లును ఎన్నుకున్నారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

రాజాపేట : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి రావాలని కోరుతూ యాదగిరిగుట్ట నుంచి రాజాపేట మీదుగా కొమురవెల్లి వరకు యాదగిరిగుట్ట టౌన్ కాంగ్రెస్ నాయకులు చేపట్టిన పాదయాత్రకు రాజాపేట మండల కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీగా పాదయాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, నాయకులు పెంటయ్య గౌడ్, ఇంజ నరేష్, నెమిల కేదారి, బాలయ్య, కళ్లెం పాండు, బాబు, సత్యనారాయణ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో మంచి గుర్తింపు



కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న శివప్రసాద్

రామన్నపేట : గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రామన్నపేట లయన్స్‌క్లబ్ గుర్తింపు పొందిందని జిల్లా గవర్నర్ సీహెచ్ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం రామన్నపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు నూతన జిల్లాగవర్నర్‌గా ఆస్ట్రేలియాలో ప్రమాణ స్వీకారం చేసి స్వదేశానికి వచ్చిన యారా ప్రభాకర్ రెడ్డికి చిట్యాలలో స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సంజీవరెడ్డి ఆర్‌సీ రవిందర్‌రావు, జెడ్‌సీ బొడ్డు శంకరయ్య, యాపాల క్రిష్ణారెడ్డి, అనువర్ణాదేవి, నూల సిద్దప్ప, కళ్లెం అనంతరెడ్డి, టి. సూర్యనారాయణ, పనకంటి భాస్కర్‌రావు, బొడ్డు వెంకటేశం, బి.గోవర్ధనాచారి, జినుకల ప్రభాకర్, అయిలయ్య, విజయానందం, బాబురావు పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

భువనగిరిటౌన్ : జూలై 1న రవీంద్రభారతీలో జరిగే గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీ జిల్లా కన్వీనర్ రాజేష్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ సంఘం ముఖ్య కార్యాకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరుగుతున్న గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాములు నాయక్, భాస్కర్ నాయక్, వెంకటేశ్ నాయక్, మోహన్ నాయక్, లింగా నాయక్ పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి



రామన్నపేటలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రామన్నపేట : కొత్త క్రిమినల్ మేజర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని రామన్నపేట బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, ఐలూ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. జూలై 1నుంచి అమలు చేయతలపెట్టిన కొత్త క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు రామన్నపేట అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జీ కోర్టు ఎదుట ప్లకార్డులతో నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త చట్టాలు న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ జగతయ్య, గాలి లింగయ్య, నకిరేకంటి మొగులయ్య, యాదాసు యాదయ్య, దినేష్‌కుమార్, సుక్క శ్రవన్ కుమార్, నోముల స్వామి, దంతూరి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో నిత్య కల్యాణమహోత్సవం



వెంకటేశ్వర స్వామి నిత్య కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పండితులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిత్య కల్యాణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వేయి నామాలతో సహస్రనామార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తోమాల కార్యక్రమం, నిత్య కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు డీఆర్‌డీఓ కృష్ణన్ కుటుంబ సభ్యులతో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం



మాట్లాడుతున్న చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ : రైతులకు మెరుగైన సేవలందిస్తామని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి తెలిపారు. అందుకోసం పాలకవర్గం నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఆదాయ వ్యయాలు, ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల వ్యాపారంపై చర్చించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు పంటల సాగు చేసినప్పటి నుండి కోతల సమయం వరకు తోడుగా ఉంటామని తెలిపారు. రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే తన ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ సెక్రటరీ ఎరుకల రమేష్, డైరెక్టర్లు దుబ్బాక శిధర్‌రెడ్డి, గుండెబోయిన రూపమ్మ, పబ్బతి వెంకటేశం, దొడ్డి శ్రీశైలం, సూర, దొడి బాలరాజు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సమస్యను పరిష్కరించాలి

మోత్కూరు : ముదిరాజ్‌ల రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ ముదిరాజ్‌ల చిరకాల వాంఛ అయిన బీసీ డి నుంచి బీసీ ఏ జాబితాలోకి మారుస్తామని పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అనేక సందర్భాల్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఆయన వెంట మెప్మా జిల్లా నాయకులు మాదాసు నర్సింహ, మాదాసు రాములు, వెంకన్న, దాసరి అర్వపల్లి, సాయిని మనోహర్, దాసరి ఈశ్వర్, కృష్ణ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌వి చిల్లర రాజకీయాలు

మోత్కూరు : ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో భాగంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాల రూపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలుమల్లు విమర్శించారు. శుక్రవారం వారు మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం బడ్జెట్ నిధుల నుంచి నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణం ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకంలో తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ పేరును అతి చిన్నగా, అగౌరవ పరిచే విధంగా పెట్టించారని అన్నారు. ఎమ్మెల్యేను ఎంత అగౌరవపరిచినా ఆయన ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటారని అన్నారు. సమావేశంలో రాచకొండ బాలరాజు, మందుల సురేష్, అవిశెట్టి కిరణ్‌కుమార్, బయ్యని రాజు, పల్లపు సమ్మయ్య, అనిల్, కొమురయ్య పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ అధ్యక్షుడు పడిడం యాదగిరి తదితరులు

భూదాన్‌పోచంపల్లి : అర్హులైన విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు పగిడం యాదగిరి, కార్యదర్శి ఎస్, అమర్నాథ్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి జెండా విష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. అలాగే తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే భద్రతా పరికరాలను అందజేయాలని అన్నారు. విద్యుత్‌ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల సాధన కొరకు యూనియన్ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు వెంకటేశం, జిల్లా అదనపు కార్యదర్శి తిరుమలయ్య, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పోచంపల్లి సెక్షన్‌లీడర్లు మిస్బావుద్దీన్, బొల్లేపల్లి మహేశ్, చౌటుప్పల్, భువనగిరి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లె రమేశ్, గంగుల సోమేశ్వర్, మీర్జా షకీల్‌బేగ్, రమేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, అకోశ్, నోముల యాదయ్య, సురేశ్, గునిగంటి బాబు, శ్రీరాంరెడ్డి, సోమిరెడ్డి, జనార్థన్, మహేశ్, నర్సింహులు, స్వామి, మహేశ్, యాకూబ్,పాషు, ఏలేంద్రకుమార్, మహేశ్, అశోక్, జంగయ్య, సాయికృష్ణ పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు



ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ కల్పన, మండల పరిషత్ ఉద్యోగులు

మోత్కూరు : అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులను ప్రజల్లో గుర్తింపు ఉంటుందని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ సురేష్, ఎంపీపీ రచ్చ కల్పనలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మోత్కూరు ఎంపీడీఓ పోరెడ్డి మనోహర్‌రెడ్డి ఈ నెల 30న పదవీ విరమణ ఉత్సవం సందర్భంగా వీడ్కోలు సన్మాన సభను శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పోరెడ్డి మనోహర్‌రెడ్డి, పద్మజ దంపతులను మండల పరిషత్ ఆధ్వర్యంలో, మాజీ సర్పంచ్‌ల సంఘం, వివిధ సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు జ్ఞాపికలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీఓ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించారని, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని అభినందించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, వై.శ్రీనివాస్‌రెడ్డి, ఏపాల సత్యనారాయణరెడ్డి, మందడి ఉపేందర్‌రెడ్డి, అడ్డగూడూరు ఎంపీపీ దర్శనాల అంజయ్య, మోత్కూరు వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు చింతల వరలక్ష్మి, గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బొమ్మయిపల్లిలో నివసించే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వ వీరికి పట్టాలు ఇచ్చారు కాని స్థలం చూపించలేదన్నారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం వచ్చినా పట్టించుకోలేదని వెంటనే ఇంటి స్థలం చూపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ రెవెన్యూ బెల్ షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, పుట్ట రమేష్, దాసరి లక్ష్మయ్య, 11 వ వార్డు చింతల పెంటయ్య, మరి పెళ్లి రాములు, నాయకులు షర్ఫుద్దీన్ దొడ్డి బాలయ్య, కూరం పోషాలు, పర్వతం బాలకృష్ణ పాల్గొన్నారు

ఫీజులు నియంత్రించాలని వినతి

మోటకొండూర్: ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని కోరుతూ, మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌వై యువజన విభాగం, ఆలేరు నియోజకవర్గ జనరల్ సెక్రటరీ జీవిలికపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పీఆర్‌పీ సామ సత్తిరెడ్డికి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌ల పేరుతో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ పట్టణ అధ్యక్షులు ప్రశాంత్, పాండు ఉన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

చౌటుప్పల్ : నిజమైన సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణ కేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకులంలో పదవీ విరమణ పొందిన రికార్డు అసిస్టెంట్ తిరుపతయ్య, ఆఫీస్ సబార్డినేట్ వెంకయ్య, మస్తాన్‌ల పదవీ విరమణ సన్మానోత్సవం శుక్రవారం నిర్వహించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ సాయిలు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

యాదగిరిగుట్ట రూరల్ : జూలై 10వ తేదీన జరిగే కార్మికుల డిమాండ్స్ డే ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు అంకితం కావాలి



హెచ్‌ఎం యాస పద్మారెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

ఆత్మకూరు(ఎం): విద్యా రంగ అభివృద్ధికి కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు యాస పద్మారెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం ప్రజాసేవకు అంకితం కావాలని ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం అన్నారు. గురువారం మండలంలోని మొరిపిరాలలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాస పద్మారెడ్డి పదవి విరమణ కార్యక్రమం సందర్భంగా ఘనంగా సన్మానించిన అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ముద్దసాని జయమ్మ, దేవాలయ కమిటి చైర్మన్ ముద్దసాని చిన శంకరయ్య, పాఠశాల శాశ్వత దాత చింతపట్ల వినుకర్‌రావు, మాజీ సర్పంచ్ సామ తిరుమలరెడ్డి, పంచాయతి కార్యదర్శి అంబోజు శేఖర్, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి

భువనగిరి : బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణరావు, జిల్లా అధ్యక్షుడు అకవరం రమేష్,కార్యదర్శి దానం రామేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజుశర్మ, నర్సింహారావు, రాంమోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

వలిగొండలో...

వలిగొండ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహా రావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పులా మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, పాశం సతి రెడ్డి, బాథరాజు ఉమా బాల్ నర్సింహ, కంకల కిష్టయ్య,కుందారపు కొమురయ్య, పాల్గొన్నారు.

భువనగిరి అభివృద్ధికి కృషి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలో 21వ వార్డులో డ్రైయినేజీపై స్లాబ్ వేసే పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉదయగిరి విజయకుమార్, డీఈ కొండలరావు ఉన్నారు.

మైక్ సెట్ బహూకరణ

మోత్కూరు : మోత్కూరు మండలంలోని సదర్శాపూర్ గ్రామ పంచాయతీకి మైక్ సెట్‌ను ఎంపీపీ రచ్చ కల్పన, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి దంపతులు శుక్రవారం బహూకరించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి వెటర్నరి ఏడీ మోతీలాల్‌కు దాతలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మాజీ సర్పంచ్ వర్రె కవితశ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మెతుకు రాములు మరణించారు. శుక్రవారం ఆ కుటుంబాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ రచ్చ కల్పన, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బండి రాజు, గనగాని యాదగిరి, రాచకొండ సుధాకర్, దొండ దశరథ, గనగాని రాజేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఇటీవల మృతిచెందిన బొల్లు రూపమ్మ కుటుంబాన్ని న్యాయవాది చెరుకు శివకుమార్ శుక్రవారం పరామర్శించారు. రూ.5వేల నగదును అందజేశారు.

సంక్షిప్త సమాచారం

గురుకుల భవనాలు ప్రారంభించాలి

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గురుకుల భవనాలను వెంటనే ప్రారంభించాలని బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ల కార్తిక్ ప్రభుత్వాన్ని కోరారు. సర్వేల్‌లో నిర్మించిన భవనాలను శుక్రవారం సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ, నవీన్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండ చూడాలన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆత్మకూరు(ఎం): చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేనేత, జౌళి శాఖ రాష్ట్ర కమిషనర్ శైలజా రామయ్యకు హైదరాబాద్‌లో గురువారం గుండాల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు దుడుక ఉప్పలయ్య, చౌటుప్పల్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కందగట్ల భిక్షపతితో కలిసి వినతిపత్రం అందచేసినట్లు మోత్కూరు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు రాములు తెలిపారు. త్రిఫ్ట ఫండ్‌ను అమలు చేయాలని, చేనేత మిత్రను అమలు చేయాలని, సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని వినతి పత్రం ద్వారా కోరినట్లు ఆయన చెప్పారు.

సౌకర్యాలు కల్పించాలి

సంస్థాన్ నారాయణపురం: దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ మస్క్యులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సమావేశం శుక్రవారం లింగవారిగూడెంలో నిర్వహించి మాట్లాడారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం తీవ్ర వైకల్యం కల్గిన వారికి కేర్‌టేకర్ నియమించాలని, హెల్త్ కార్డు, పౌష్టికాహారం, పింఛను పెంపు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

బస్సు సర్వీసు ప్రారంభం

వలిగొండ : మండలకేంద్రం నుండి గోకారం, వర్కట్పల్లి, సంగం చౌటుప్పల్ వరకు నూతనంగా బస్సు సౌకర్యం కల్పించడంతో శుక్రవారం వలిగొండలో బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, వైస్ ఎంపీపీ బాథరాజు ఉమా బాల నర్సింహ, పాశం సతి రెడ్డి, కంకల కిష్టయ్య, కాసుల వెంకన్న, కుందారపు కొమురయ్య, పల్లెర్ల రాజు, ఉపేందర్ బోస్ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

చౌటుప్పల్ : మున్సిపల్ కేంద్రంతోపాటు మండల పరిధిలోని చిన్నకొండూర్, పెద్దకొండూర్, మసీద్ గూడెం గ్రామాల్లో శుక్రవారం టీడీపీ జెండావిష్కరణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో వర్కాల వెంకటేశం, నల్ల పర్వతాలు, పాశం రఘుపతి, ఎడ్ల రాంరెడ్డి, గుమ్మడి అంజిరెడ్డి, గోశిక పాండు, సుంకరి జంగయ్య, పోలోజు గోవిందచారి, బోసి నర్సింహ్మ, తొర్పునూరి శ్రీను, సంజీవ సీతయ్య, తీగుళ్ల అయిలయ్య, ముత్యాల పాపిరెడ్డి పాల్గొన్నారు.

పాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

చౌటుప్పల్ : మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం జరిగాయి. సంఘం చైర్మన్‌గా ఆకుల పద్మ, డైరెక్టర్లుగా గోరుకంటి దుర్గమ్మ, పల్చ పద్మమ్మ, బతరాజు అండాలు ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గాన్ని గ్రామస్తులు అభినంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంచాల జంగయ్యను ఎన్నుకున్నారు. అదే విధంగా 9మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల నిర్వాహకుడిగా ఎం. గోపాల్ రెడ్డి వ్యవహరించారు.

పాలసంఘం చైర్‌పర్సన్‌గా నీలమ్మ

రామన్నపేట : ఉత్తటూరు పాలసంఘం చైర్‌పర్సన్‌గా దాసరి నీలమ్మలింగయ్య ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన చైర్మన్ ఎన్నికలో డైరెక్టర్లు యాదగిరిరావు, ఏనుగు వెంకట్‌రెడ్డి, పబ్బు అండాలు, పానుగోటి నర్సింహారావు, పాల్గొన్నారు.

పాల సంఘం చైర్మన్‌గా బాపిరెడ్డి

రాజాపేట : మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా రామిడి బాపిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శుక్రవారం పాల సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన డైరెక్టర్లుగా ఎమ్మ శ్రీను, గద్ద శేఖర్ ఎన్నికయ్యారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

భువనగిరి క్రైం : పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు కనిపెట్టి బాధితులకు అప్పగించారు. భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రా రవి, చిలీ రేణుక, చిన్నం అంజయ్య, కోలా మల్లేశ్‌లు తమ ఫోన్‌లను పోగొట్టుకున్నామని గతంలో భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొబైల్స్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నంబర్స్ ఆధారంగా గుర్తించి బాధితులకు మొబైల్స్ అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.